క్లుప్తంగా

ఓడినా, గెలిచినా ప్రజల మధ్యే



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మదన్‌లాల్

వైరా: ఓడినా గెలిచినా ప్రజల మధ్యే ఉంటానని, తనను నమ్ముకుని ఉన్న వారెవ్వరూ అధైర్యపడొద్దని బీఆర్ఎస్ శ్రేణులకు అండగా ఉంటానని వైరా మాజీ ఎమ్మెల్యే బీఆర్ఎస్ అభ్యర్థి బానోత్ మదన్‌లాల్ అన్నారు. వైరా నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి పాలైన ఆయన సోమవారం వైరాలోని తన క్యాంపు కార్యాలయంలో మాట్లాడారు. ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవించాలన్నారు. ప్రతీ కార్యకర్త పార్టీ అభివృద్ధే ధ్యేయంగా పనిచేయాలన్నారు. ఏ కష్టం వచ్చినా అండగా ఉంటానన్నారు. గెలుపొందిన రాందాస్‌నాయక్‌కు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు బాణాల వెంకటేశ్వర్లు, మద్దెల రవి, కట్టా కృష్ణార్జునరావు, డాక్టర్ కాపా మురళీ కృష్ణ, మాదినేని ప్రసాద్, కౌన్సిలర్ తడికమళ్ల నాగేశ్వరరావు, సర్పంచ్‌లు సాదం రామారావు, భట్టు భద్రయ్య, బానోత్ సుక్కుబాయి, తదితరులు ఉన్నారు.

ప్రజలను తప్పు పట్టం..

వైరా: ఓట్లు వేయలేదని కృంగిపోయి ప్రజలను తప్పు పట్టబోమని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బొంతు రాంబాబు అన్నారు. సోమవారం వైరాలోని సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన పట్టణ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో ప్రధాన పార్టీలు వందల కోట్ల రూపాయలు ఖర్చు పెట్టడం వల్ల సరైన ఓట్లు రాబట్టుకోలేక పోయామన్నారు. ఓట్లు వేసే చైతన్యం ప్రజల్లో వ్యాప్తి చేయడంలో వైఫల్యం చెందామన్నారు. మరింత పట్టుదలతో ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాడుతామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు తోట నాగేశ్వరరావు, తూము సుధాకర్, రమణ తదితరులు పాల్గొన్నారు.

అధైర్యపడొద్దు..

ఎర్రుపాలెం: మండలంలోని అన్ని గ్రామాల్లోని కార్యకర్తలు, నాయకులు, ప్రజాప్రతినిధులు పార్టీ అధికారంలోకి రాలేదనే ఆలోచనతో అధైర్యపడొద్దని ఆపార్టీ మండల కమిటీ అధ్యక్షుడు పంబి సాంబశివరావు కోరారు. సోమవారం మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి లింగాల కమల్‌రాజ్‌కి 75 వేలకు పైగా ఓట్లేసిన ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. కొందరు బీఆర్ఎస్ పార్టీలో కొనసాగి తమ స్వార్థం కోసం వాడుకొని అధికారం రాకపోయేసరికి పార్టీపై నిందలువేయడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ మస్తాన్‌వలీ, సగ్గుర్తి కిషోర్, నాయకులు ఇనపనూరి భాస్కర్, పులి శిరీష, గుర్రాల పుల్లారెడ్డి, దేవరకొండ రవి, వీరంశెట్టి శ్రీను, శ్రీపాలశెట్టి తిరుపతిరావు, షేక్ హుస్సేన్, ఎస్.కె బాబ్జి, బాలరాజు, దేవరకొండ వెంకటేశ్వరరావు, వెంకన్న, యాకోబు, వెంకటేశ్వర్లు, దానయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపోరాటాలకు ఓటమి ఉండదు

కారేపల్లి: ప్రజా పోరాటాలకు ఓటమి ఉండదని, ప్రజాసమస్యల పరిష్కారమే ధ్యేయంగా, పేదల పక్షాన పోరాడేది సీపీఎం ఒక్కటేనని ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కొండెబోయిన నాగేశ్వరరావు అన్నారు. సోమవారం ఉసిరికాయలపల్లి గ్రామపంచాయితీ సర్పంచ్ బానోత్ బన్సీలాల్ తండ్రి దేవ్లానాయక్ సంస్మరణ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా దేవ్లానాయక్ చిత్రపటానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళ్లు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కమ్యూనిస్టులకు ప్రజాపోరాటాలే ఆయుధమని, గెలుపు ఓటములు తాత్కాలికమేనని అన్నారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి కె.నరేంద్ర, మాధారం సర్పంచ్ అజ్మీరా నరేష్, ఎంపిటిసి మూడు జ్యోతిమోహన్, నాయకులు భూక్యా గోపి, మూడు దస్రు, దాసరి సైదులు, తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతాయుతంగా పనిచేస్తాం

కొణిజర్ల: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడంతో తమపై బాధ్యత మరింత పెరిగిందని ప్రజలు మెరుగైన సేవలందించేందుకు సిద్ధంగా ఉన్నామని కాంగ్రెస్ పార్టీ ఖమ్మం పార్లమెంట్ ఎల్‌డీఎం కన్వీనర్ సూరంపల్లి రామారావు అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మెజార్టీ స్థానాలు సాధించి అధికారంలోకి రావడంతో ఆ పార్టీ కార్యకర్తలు సంబరాలు జరుపుకుని దివంగత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం వద్ద నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దివంగత మహానేత వైఎస్ఆర్ పాలనకు ధీటుగా ప్రజా సేవ కొనసాగిస్తామన్నారు. కొణిజర్ల మండలంలో కాంగ్రెస్ పార్టీకి నియోజకవర్గంలోనే అత్యధిక మెజార్టీ వచ్చిందని అందుకు కృషి చేసిన ప్రతి నాయకుడు, కార్యకర్తలకు పేరు పేరునా ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మేడా లక్ష్మయ్య, రచ్చా వెంకటేశ్వర్లు, గుడివాడ వెంకటేశ్వర్లు, సురేష్, రమేష్, వెంకన్న, రామారావు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌దే పై‘చేయి’

- సత్తుపల్లిలో మొదటి రౌండ్ మినహా అన్నింటా మెజార్టీనే
- ప్రధాన నేతల గ్రామాల్లో కూడా కారుకు బ్రేక్
- పట్టణ ప్రాంతాల్లో హస్తం జోరు

మండలం	కాంగ్రెస్	బీఆర్ఎస్	మెజార్టీ
తల్లాడ	19,583	17,813	1,770
కల్లూరు	24,239	20,229	4,010
పెనుబల్లి	19,490	16,849	2,641
సత్తుపల్లి	28,843	21,926	6,917
వేంసూరు	17,294	14,157	3,137
పోస్టల్ ఓట్లు	1,796	831	965
మొత్తం	1,11,245	91,805	19,440

సత్తుపల్లి : అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీదే పైచేయి కనిపించింది. కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ మట్టా రాగమయి 1,11,245ఓట్లు, బీఆర్ఎస్ అభ్యర్థి సండ్ర వెంకటవీరయ్యకు 91,805ఓట్లు వచ్చాయి. పోస్టల్ బ్యాలెట్లలో కూడా కాంగ్రెస్ పార్టీ 988ఓట్ల మెజార్టీ సాధించింది. 19,440ఓట్ల మెజార్టీ రాగమయికి దక్కింది. బీఆర్ఎస్ అనుకూలమైన తల్లాడ మండలంలో మొదటి రౌండ్‌లో కనీసం 2వేల మెజార్టీ వస్తుందని బీఆర్ఎస్ వేసిన అంచనాలు తారుమారై 203ఓట్లు రావడంతో ఆపార్టీ నేతల్లో తొలి రౌండ్‌లోనే నిరాశ నెలకొంది. 2వ రౌండ్‌లో ఒక్కసారిగా 1,242ఓట్లు కాంగ్రెస్ ఆధిక్యత ప్రదర్శించడంతో కాంగ్రెస్ పార్టీకి 1,039ఓట్లతో మెజార్టీని నమోదు చేసుకుంది. ఇక అక్కడి నుంచి ప్రతీరౌండ్‌లో కూడా 403నుంచి 2,149వరకు మెజార్టీలు నమోదు చేసుకోవడంతో ప్రత్యర్థి పార్టీ బీఆర్ఎస్‌కు ఓటమి చవి చూడాల్సి వచ్చింది. తల్లాడ మండలం నుంచి కల్లూరు, పెనుబల్లి, సత్తుపల్లి, వేంసూరు మండలాల్లో కాంగ్రెస్ ఆధిపత్యం ప్రదర్శించింది.

పట్టణ ఓటరు కాంగ్రెస్ వైపే..

2019లో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో ప్రచారం చేయకపోయినా పట్టణ ఓటర్లు కాంగ్రెస్ వైపే మొగ్గుచూపారు. ప్రమాద ఘంటికలు హెచ్చరించినా బీఆర్ఎస్ నాయకత్వం నష్ట నివారణ చర్యలు చేపట్టడంలో విఫలం కావడంతోనే అసెంబ్లీ ఎన్నికల్లో కూడా ఓటమి చవిచూడాల్సి వచ్చిందని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఈసారి సత్తుపల్లి మున్సిపాలిటీలో ఓటర్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం రావాలని కసితో ఓట్లు వేసినట్లు అనిపిస్తుంది. ప్రతి వార్డుల్లో కూడా కాంగ్రెస్ పార్టీ ఆధిక్యత ప్రదర్శించారు. ఒకటి, రెండు వార్డుల్లో ఐదారు ఓట్ల మెజార్టీ మాత్రం కనిపించింది. కొన్ని వార్డుల్లో అయితే 100నుంచి 200కు పైగా మెజార్టీ రావడం ఓటర్ల మార్పు కనిపించింది. ఎన్టీఆర్ నగర్, రాజీవ్‌నగర్, జలగం నగర్, గాంధీనగర్, వెంగళరావు నగర్, విరాట్‌నగర్‌లలో కాంగ్రెస్ ఆధిక్యత ప్రదర్శించింది. కల్లూరు, తల్లాడ మేజర్ పంచాయితీలలోనూ అదే ఒరవడి కొనసాగింది.

ఆ వర్గాల ఓట్లు రాలేదు..

సత్తుపల్లి నియోజకవర్గంలో ప్రధాన సామాజికవర్గాల ఓట్లు ఈసారి కాంగ్రెస్ వైపు చూడటంతో విజయం వరించింది. బీఆర్ఎస్, బీజేపీ ఒక్కటేనని జరిగిన ప్రచారంతో మైనార్టీలు బీఆర్ఎస్‌కు దూరంగా జరగడంతో కాంగ్రెస్‌కు లాభం జరిగినట్లయింది. మరో ప్రధాన సామాజికవర్గానికి ముఖ్య నేతలు ఈసారి కాంగ్రెస్‌తో కలిసి పనిచేయడం, వ్యాపారవర్గాలు, ఉద్యోగ వర్గాలు, నిరుద్యోగులు, యువత ఓట్లు సహకరించడంతో కాంగ్రెస్ మెజార్టీ పెరిగినట్లయింది. మహిళలు ఈసారి పెద్ద సంఖ్యలో ఓటింగ్‌లో పాల్గొన్న బీఆర్ఎస్ ప్రభుత్వంపై వ్యతిరేకతతో ఓటు చేసినట్లు సర్వే సంస్థలు వెల్లడించాయి.

బీఆర్ఎస్‌కు పెరగని ఓట్లు..

2018ఎన్నికలలో టీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి పిడమర్తి రవికి 81,042 ఓట్లు వచ్చాయి. 2023 ఎన్నికలలో బీఆర్ఎస్ అభ్యర్థి సండ్ర వెంకటవీరయ్యకు 91,805 ఓట్లు వచ్చాయి. 10,763ఓట్లు మాత్రమే అధికంగా వచ్చాయి. సండ్ర వెంకటవీరయ్య టీడీపీ నుంచి బీఆర్ఎస్‌లో చేరినా ఆపార్టీ ఓటు షేరింగ్‌లో పెద్ద ప్రభావం చూపించలేదు. 2018అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ మద్దతుతో టీడీపీ అభ్యర్థిగా పోటీచేసిన సండ్ర వెంకటవీరయ్యకు 1,00,044ఓట్లతో 19,002మెజార్టీతో గెలుపొందారు. కాంగ్రెస్ మద్దతుతోనే అన్ని ఓట్లు వచ్చినట్లు రాజకీయ విశ్లేషకులు అంచనా వేశారు. గత ఎన్నికల కంటే 8,239ఓట్లు తక్కువగా వచ్చాయి. ఈ ప్రాంతంలో టీఆర్ఎస్, బీఆర్ఎస్ ఇప్పటివరకు అసెంబ్లీ ఎన్నికల్లో విజయం నమోదు చేసుకోలేదు. ఈ సారి కాంగ్రెస్ పార్టీ బలమైన అభ్యర్థి డాక్టర్ మట్టా రాగమయిని బరిలోకి దింపడంతో పాటు.. పొంగులేటి, తుమ్మలలు ప్రతిష్టాత్మకంగా తీసుకోవడంతో మట్టా రాగమయికి భారీ మెజార్టీ దక్కింది.

ఓటర్లే ముందుకు వచ్చి...


కాంగ్రెస్ పార్టీ టికెట్ చివరి నిమిషం వరకు డాక్టర్ మట్టా రాగమయికి కేటాయించకపోవడంతో కాంగ్రెస్ పార్టీ శ్రేణుల్లో ఉత్కంఠత ఉంది. నామినేషన్ ప్రక్రియ ప్రారంభమైన 3రోజులకు మట్టా రాగమయి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిత్వం దక్కడం, అప్పటి వరకు టికెట్‌ను ఆశించిన సంభాని చంద్రశేఖర్, కోటూరి మానవతారాయ్, కొండూరు సుధాకర్ కాంగ్రెస్‌ను వీడి ప్రత్యర్థి బీఆర్ఎస్ పార్టీలో చేరడమే కాకుండా ప్రచారం చేయడంపై ప్రజలలో చర్చకు దారితీసింది. మట్టా రాగమయి ఎన్నికల ప్రచారంలో నాయకులను సమన్వయం చేసుకోవడం బాధ్యతలను ఆమె భర్త డాక్టర్ దయానంద్ చూసుకోవడం, ప్రచారం నిర్వహించడంపై ప్రజలలో సానుభూతి వ్యక్తం కావడంతో.. ఓటర్లే నాయకులుగా మట్టా రాగమయికి ఓటువేసి మద్దతు తెలిపారు.

బీజేపీ, బీఎస్పీకి ఆదరణ దక్కలేదు..

సత్తుపల్లి నియోజకవర్గం నుంచి బీజేపీ, బీఎస్పీలను ఓటర్లు ఆదరించలేదు. 2018ఎన్నికలలో బీజేపీ అభ్యర్థి నంబూరి రామలింగేశ్వరరావుకు 1,600ఓట్లు రాగా ఈ సారి 1,882ఓట్లు మాత్రమే వచ్చాయి. ఈ సారి ఎన్నికలలో బీఎస్పీ అభ్యర్థిగా శీలం వెంకటేశ్వరరావుకు 1,415ఓట్లు మాత్రమే దక్కాయి. సీపీఎం అభ్యర్థి మాచర్ల భారతికి 1,225ఓట్లు రాబట్టింది. 2018ఎన్నికల్లో నోటాకు 1,672ఓట్లు రాగా ఈసారి కేవలం 635ఓట్లు మాత్రమే పడ్డాయి. ఇండిపెండెంట్‌గా పోటీచేసిన 18మందికి కనీస ఓట్లు కూడా రాలేదు.

అన్ని మండలాల్లో ‘హస్తం’దే హవా

బీఆర్ఎస్‌ను ఆదరించని గిరిజనం ● చేతి గుర్తుపై ఓటెత్తిన ప్రజలు



మండలం	కాంగ్రెస్	బీఆర్ఎస్	సీపీఎం	మెజార్టీ
కారేపల్లి	20283	14753	781	5530
జూలూరుపాడు	12253	9784	482	2469
ఏన్కూరు	14155	8205	499	5950
కొణిజర్ల	24617	15148	1447	9469
వైరా	21089	2566	1192	8523
పోస్టల్ ఓట్లు	1516	412	38	
మొత్తం	93913	50868	4439	

వైరా/కొణిజర్ల : వైరా నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో ప్రధాన ప్రత్యర్థులు కాంగ్రెస్ బీఆర్ఎస్ పార్టీలకు లభించిన ఓట్లు ఈ విధంగా ఉన్నాయి.

వైరా మున్సిపాలిటీలో..

వైరా మున్సిపాలిటీలో సైతం కాంగ్రెస్ పార్టీకే భారీ మెజార్టీ వచ్చింది. వైరా మున్సిపాలిటీలో పరిధిలోని 20 వార్డులుండగా అన్ని వార్డుల్లో కూడా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికే మెజార్టీ వచ్చింది. మున్సిపాలిలో ప్రత్యేకంగా ఓట్లు బయటకు తీయగా మున్సిపాలిటీ పరిధిలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మాలోత్ రాందాస్ నాయక్‌కు 11,687 ఓట్లు రాగా బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి బానోత్ మదన్‌లాల్‌కు 6,558 ఓట్లు లభించాయి కాంగ్రెస్‌కు 5129 మెజార్టీ లభించింది. మండలం మొత్తంతో పోల్చినప్పుడు సగానికి పైగా మెజార్టీ వైరా మున్సిపాలిటీలోనే లభించింది. పట్టణ ప్రజలు కూడా కాంగ్రెస్ పార్టీకి పూర్తి స్థాయి మెజార్టీ సాధిచినట్లు అయ్యింది.

జాడలేని జనసేన..

బీజేపీతో జతకట్టి తెలంగాణలో పోటీ చేసిన జనసేన పార్టీ వైరా నియోజకవర్గంలో కనీస ఓట్లు కూడా సాధించలేకపోయింది. ఇండిపెండెంట్‌లకు వచ్చిన ఓట్లు కూడా జనసేన అభ్యర్థి సాధించలేకపోవడం విశేషం. జనసేన అభ్యర్థికి సింగరేణి మండలంలో 546, జూలూరుపాడులో 382, ఏన్కూరు 407, కొణిజర్ల 769, వైరా 575 మొత్తం 2679 ఓట్లు సాధించి డిపాజిట్ కోల్పోయారు.

కామ్రేడ్లకు దక్కని ఆదరణ..

నియోజకవర్గంలో ప్రతి ఐదేండ్లకోసారి జరిగే ఎన్నికల్లో కమ్యూనిస్టులకు ప్రజల నుంచి ఆదరణ కరువయితుందంటే ప్రత్యక్ష ఎన్నికల్లో సీపీఎంకి వచ్చిన ఓట్లే నిదర్శనం. 2018 ఎన్నికల్లో బీఎల్ఎఫ్ అభ్యర్థిగా పోటీ చేసిన భూక్యా వీరభద్రంకు 11,373 ఓట్లు పోలయ్యాయి. అదే అభ్యర్థి 2023లో సీపీఎం తరుపున పోటీ చేయగా కేవలం 4,439 ఓట్లు మాత్రమే సాధించగలిగారు. గత ఎన్నికలతో పోల్చుకుంటే వారి ఓటింగ్ శాతం సగానికి పైగా పడిపోయింది. దీంతో కమ్యూనిస్టులు ఆదరణ కోల్పోతున్నారని ఆ పార్టీ నాయకులే బహిరంగంగా చర్చించుకుంటున్నారు.

వైరా ఓటర్ల విలక్షణ తీర్పు..

వైరా ఓటర్లు ప్రతి ఎన్నికల్లో కూడా విలక్షణ తీర్పు ఇస్తున్నారు. ప్రతి ఎన్నికలో కూడా ఒకసారి గెలిచిన అభ్యర్థికి తిరిగి రెండోసారి పట్టం కట్టడం లేదు. గతంలో గెలిచిన బానోత్ చంద్రావతి రెండోసారి పోటీలో ఉన్నా గెలుపు రుచి చూడలేదు. అదే విధంగా బానోత్ మదన్‌లాల్ సైతం రెండు సార్లు పోటీలో ఉన్నప్పటికీ రెండు సార్లు ఓటమిపాలయ్యారు. దీంతో వైరా ప్రజలు విలక్షణ తీర్పు ఇస్తున్నారని ప్రజలు చెప్పుకుంటున్నారు.

మధిరలో భట్టి జోరు..

మధిర: మధిర నియోజకవర్గం అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసిన మల్లు భట్టి విక్రమార్క హవా కొనసాగింది. ఆయన తన సమీప ప్రత్యర్థి బీఆర్ఎస్ పార్టీకి చెందిన లింగాల కమల్ రాజుపై 35,452 ఓట్ల మెజార్టీతో ఘన విజయం సాధించారు. మధిర నియోజకవర్గంలో ముదిగొండ మండలంలో మల్లు భట్టి విక్రమార్కకు 8,180 ఓట్ల మెజారిటీ రాగా.. చింతకానిలోని 7,096 ఓట్లు, బోనకల్‌లో 3,489 ఓట్లు, మధిర మండలంలో 9,418 ఓట్లు భారీ మెజార్టీ రాగా.. ఎర్రుపాలెంలో 6596 ఓట్ల మెజార్టీ సాధించారు. ఈవీఎంల ద్వారా భట్టికి 34,779 ఓట్లు, పోస్టల్ బ్యాలెట్లు, ఇన్ సర్వీస్ బ్యాలెట్ల ద్వారా 673 ఓట్ల మెజార్టీ వచ్చింది. దీంతో మొత్తం 35,452 ఓట్ల మెజార్టీతో భట్టి ఘనవిజయం సాధించారు. ప్రత్యర్థి ఊహించని స్థాయిలో మునుపెన్నడూ లేని విధంగా భట్టి భారీ మెజార్టీ సాధించారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడిగా, అధిష్టానానికి విధేయుడుగా కొనసాగుతున్నారు. గతంలో ఎమ్మెల్సీగా, చీఫ్ విప్‌గా, డిప్యూటీ స్పీకర్‌గా, పీసీసీ ప్రచార కమిటీ చైర్మన్‌గా, సీఎల్పీ నేతగా పనిచేశారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి మాదిరిగా రాష్ట్ర వ్యాప్తంగా పాదయాత్ర చేపట్టి పలు సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పాలనా అనుభవంతో, ఓటమిలేని నాయకుడిగా ఆయన ముఖ్యమంత్రి రేసులో ఉన్నారు.



తగ్గిపోతున్న కమ్యూనిస్టుల ప్రభావం..

గతంలో మధిర నుంచి సీపీఎం అభ్యర్థిగా బోడేపుడి వెంకటేశ్వరరావు మూడుసార్లు, కట్టా వెంకటనరసయ్య రెండుసార్లు విజయం సాధించారు. ఒకప్పుడు సీపీఎంకి కంచుకోటగా ఉన్న మధిర రానురాను ఆ పార్టీ ప్రాభవం తగ్గిపోయింది. ఈ ఎన్నికల్లో సీపీఎం అభ్యర్థిగా పోటీ చేసిన పాలడుగు భాస్కర్ మొత్తం 6,575 ఓట్లు సాధించి డిపాజిట్ కోల్పోయారు. మల్లు భట్టి విక్రమార్క నాలుగుసార్లు వరుస విజయాలతో అటు సీపీఎంకు, ఇటు బీఆర్ఎస్ పార్టీకి చెక్ పెట్టారు.

వరుసగా నాలుగు సార్లు విజయం

అత్యధిక, అత్యల్ప మెజార్టీలోనూ భట్టిదే రికార్డు

మధిర: మధిర నియోజకవర్గంలో మల్లు భట్టి విక్రమార్క వరుసగా నాలుగు సార్లు విజయం సాధించి చరిత్ర సృష్టించారు. మధిర నియోజకవర్గానికి తొలిసారిగా 1952లో ఎన్నికలు జరిగాయి. ఇప్పటి వరకు ఒక ఉప ఎన్నికతో పాటు 18 సార్లు ఎన్నికలు జరిగాయి. 2009లో తొలిసారిగా మల్లు భట్టి విక్రమార్క మధిర నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా విజయం సాధించారు. ఆ తర్వాత 2014, 2018, వరుసగా మూడుసార్లు విజయం సాధించి హ్యాట్రిక్ సృష్టించారు. ఈ ఎన్నికల్లో మరోసారి కలిపి మధిర నియోజకవర్గ చరిత్రలో నాలుగు సార్లు గెలిచిన ఘనత భట్టి విక్రమార్కకే దక్కింది. 1985, 1989, 1994 ఎన్నికల్లో వరుసగా సీపీఎం అభ్యర్థి బోడేపూడి వెంకటేశ్వరరావు వరసగా మూడుసార్లు విజయం సాధించారు. బోడెపుడి రికార్డును మల్లు భట్టి విక్రమార్క నాలుగో సారి గెలిచి అధిగమించారు. 1962, 1967 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా దుగ్గినేని వెంకయ్య వరుసగా రెండుసార్లు విజయం సాధించారు. మధిర నియోజకవర్గానికి 18 సార్లు జరిగిన ఎన్నికల్లో అత్యధిక మెజార్టీని సాధించిన ఘనత మల్లు భట్టి విక్రమార్కకే దక్కింది. ఈ ఎన్నికల్లో మల్లు భట్టి విక్రమార్క 35,452 ఓట్ల మెజార్టీతో ఘన విజయం సాధించారు.

అదేవిధంగా అతి తక్కువ ఓట్లతో గెలుపొందిన ఘనత కూడా భట్టికే ఉంది. మధిర అసెంబ్లీ స్థానం నుంచి 2009లో తొలిసారిగా పోటీ చేసినప్పుడు 1417 ఓట్ల అతి తక్కువ మెజార్టీతో భట్టి విక్రమార్క విజయం సాధించారు. మధిర నియోజకవర్గ చరిత్రలో అతి తక్కువ ఓట్లతో గెలిచిన రికార్డు సైతం భట్టికే ఉంది.

ప్రజలకు రుణపడి ఉంటాం..

భట్టి విక్రమార్క సతీమణి నందిని

మధిర: మధిర ఎమ్మెల్యేగా నాలుగో సారి మల్లు భట్టి విక్రమార్కను గెలిపించేందుకు కృషి చేసిన నియోజకవర్గ ప్రజలతో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలకు రుణపడి ఉంటామని మల్లు భట్టి విక్రమార్క సతీమణి, అమ్మ ఫౌండేషన్ చైర్మన్ మల్లు నందిని తెలిపారు. మధిరలోని కాంగ్రెస్ కార్యాలయంలో సోమవారం నందిని జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్, టీడీపీ, సీపీఐ నాయకులు కార్యకర్తలు, అభిమానులు హాజరు కాగా ఆమె కేక్ కట్ చేశాక మాట్లాడారు. ప్రజల సమస్యలు, కష్టాలను తెలుసుకోవడానికి సీఎల్పీ నేతగా ఆదిలాబాద్ నుంచి ఖమ్మం వరకు మల్లు భట్టి విక్రమార్క పాదయాత్ర చేసి కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేశారని చెప్పారు. పాదయాత్రలో ఇచ్చిన హామీలను నూతన ప్రభుత్వంలో అమలుచేసేలా ఆయన ఉన్నత పదవిని అలంకరించనున్నారని నందిని తెలిపారు.

మధిర ప్రజలు ఇచ్చిన తీర్పు చరిత్రలో గొప్ప అధ్యాయంగా నిలుస్తుందని వెల్లడించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సూరంశెట్టి కిషోర్‌తో పాటు కాంగ్రెస్, సీపీఐ నాయకులు రంగా హన్మంతరావు, కోనా ధనికుమార్, కోట వెంకటకృష్ణ, రంగా శ్రీనివాసరావు, తూమాటి నవీన్ రెడ్డి, దారా బాలరాజు, పారుపల్లి విజయ్, కర్నాటి రామారావు, నిడమానూరి వంశీ, అద్దంకి రవి, తలుపుల వెంకటేశ్వర్లు, చెరుకూరి నాగార్జున, మోదుగు బాబు, బెజవాడ రవిబాబు, మాదల రామారావు తదితరులు పాల్గొన్నారు.



మధిరలో కేక్ కట్ చేస్తున్న మల్లు నందిని

మల్లు నందిని పుట్టినరోజు వేడుకలు..

ఎర్రుపాలెం/ముదిగొండ/కల్లూరు: ఎర్రుపాలెం మండలంలోని జమలాపురంలో మల్లు భట్టి విక్రమార్క సతీమణి నందిని జన్మదిన వేడుకలను కాంగ్రెస్ నాయకులుఘనంగా నిర్వహించార. ఎంపీపీ దేవరకొండ శిరీష, పార్టీ మండల అధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డితో పాటు అనుమోలు కృష్ణారావు, బండారు నర్సింహారావు,కడియం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. అలాగే, ముదిగొండ మండలం వల్లబిలో నిర్వహించిన నందిని జన్మదిన వేడుకల్లో నాయకులు బిచ్చాల అన్వేష్, చింతమళ్ల వంశీ, రమేష్, వినోద్, నాగేశ్వరరావు, బాలాజీ పాల్గొన్నారు. ఇక నందిని పుట్టినరోజు సందర్భంగా కల్లూరులో కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. నాయకులు శీలం బ్రహ్మారెడ్డి, ఇజ్జగాని శ్రీలత, వనుకూరి నరసింహారెడ్డి, గోసు వెంకటకృష్ణ, కోట సత్యం, యలమరెడ్డి వెంకటరామిరెడ్డి, మత్తి శ్రీనివాసరావు, పెనుగొండ సుధాకర్, సైదుబాబు, అనుమోలు జ్యోతి, సీతమ్మ, ఇందూరి సరోజిని, ఇజ్జగాని రాధ పాల్గొన్నారు.

రాజీనామా



సర్పంచ్ అప్పారావు

ఎర్రుపాలెం: బీఆర్ఎస్ పార్టీకి మండలకేంద్రానికి చెందిన సర్పంచ్ మొగిలి అప్పారావు సోమవారం రాజీనామా చేశారు. ఆయన సర్పంచ్ ఎన్నికల్లో ఇండిపెండెంట్ అభ్యర్థిగా గెలిచి బీఆర్ఎస్‌లో కొనసాగారు. గ్రామ సర్పంచ్‌గా గ్రామాభివృద్ధి విషయంలో బీఆర్ఎస్ నాయకత్వం ఏమాత్రం సహకరించలేదని, ఎంతో ఆశతో సర్పంచ్ అయ్యానని, రాజకీయాల కారణంగా ఆర్థికపరమైన ఇబ్బందులకు కొందరు గురిచేశారని వాపోయారు. గ్రామాభివృద్ధికి నిధుల కేటాయింపులో పార్టీ అధినాయకత్వం వివక్షత చూపిందని ఆరోపించారు. స్వతంత్ర్య అభ్యర్థిగా తాను గెలిచిన క్రమంలో బీఆర్ఎస్‌లో కొనసాగుతూ పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేసినట్లు వివరించారు. నిరంతరం గ్రామ ప్రజలకు తన వంతు సేవ చేస్తానన్నారు. సర్పంచ్ రాజీనామా వ్యవహారం వాట్సాప్ గ్రూపుల్లో కూడా చెక్కర్లు కొట్టింది.

అల్పాహారం వితరణ

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో 155వ రోజు పట్టణానికి చెందిన పసుమర్తి నరేష్, ప్రేమాన్విత వివాహ వార్షికోత్సవ సందర్భంగా సోమవారం పట్టణంలోని రింగ్‌సెంటర్, ప్రభుత్వ ఆస్పత్రి, పాత సెంటర్‌లోని నిరుపేదలకు అల్పాహారం వితరణగా అందించారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ నిర్వహకులు దొడ్డా కృష్ణయ్య, దారా కృష్ణారావు, జంగా సత్యనారాయణ, పెనుగొండ రమేష్ పాల్గొన్నారు.

ఆలయానికి వెండి కిరీటం బహూకరణ



అర్చకుడికి వెండి కిరీటం అందిస్తున్న భక్తులు

వైరారూరల్: మండలంలోని స్నానాల లక్ష్మీపురం శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయంలోని శివ లింగానికి చైర్మన్ చింతనిప్పు రాంబాబు, భారతి దంపతులు సోమవారం రూ. 96 వేలు విలువ చేసే వెండి కిరీటాన్ని బహూకరించారు. అనంతరం ఆలయ అర్చకుడు రాంబాబు దంపతులను శాలువాలతో ఘనంగా సత్కరించారు.

కార్తీక పూజలు



సత్తుపల్లి ఆంజనేయస్వామి ఆలయంలో దీపాలను వెలిగించిన మహిళలు



రామలింగేశ్వర స్వామి దేవాలయంలో అభిషేక పూజలో పాల్గొన్న భక్తులు

సత్తుపల్లిటౌన్: కార్తీక సోమవారం సందర్భంగా సత్తుపల్లిలోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. శివనామస్మరణతో మారుమ్రోగాయి. పుట్టలో పాలు పోసి నాగదేవతలకు పూజలు చేశారు. ఆలయాలలో సహస్ర దీపాలంకరణలు, విశేష పూజలు నిర్వహించారు.

తల్లాడ: తల్లాడలో కార్తీక సోమవారం అభిషేక పూజలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా స్థానిక రామలింగేశ్వర స్వామి దేవాలయంలో ఆలయ అర్చకులు కంచెల సతీష్ శర్మ ఆధ్వర్యంలో శివలింగానికి పంచామృతాలు, నవరసాలతో అభిషేక పూజలు జరిగాయి. అనంతరం మారేడు దళాలతో లక్ష బిల్వార్చన నిర్వహించారు. సాముహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు జరిగాయి. భక్తలకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

కాంగ్రెస్ నాయకులకు సన్మానం

కల్లూరు: కల్లూరు జామియా మసీదు కమిటీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ సత్తుపల్లి అభ్యర్థి డాక్టర్ మట్టా రాగమయి విజయం, తెలంగాణలో కాంగ్రెస్ విజయాన్ని పురస్కరించుకుని కాంగ్రెస్ నాయకులు పసుమర్తి చందర్‌రావు, మైనార్టీ యూత్ కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి షేక్ బాజీలను.. పసుమర్తి చందర్‌రావు గృహంలో సోమవారం ఘనంగా సన్మానించారు. స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పసుమర్తి చందర్‌రావు మాట్లాడుతూ.. ఈ విజయం కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల సమిష్టి విజయమన్నారు. ఎమ్మెల్యే మట్టా రాగమయికి శుభాకాంక్షలు తెలిపారు. తనను సన్మానించిన మసీదు కమిటీకి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షులు (సదర్) ఎండీ హనీఫ్, కార్యదర్శి ఎండీ మోసిన్, ఉపాధ్యక్షులు ఎస్‌కే ఖాలీద్, ఎండీ షఫి, ఎస్‌కే యాకూబ్ అలీ, ఎస్‌కే ఇబ్రహీమ్, ఎస్‌కే ఉస్మాన్, తురాబల్లి యాకూబ్, సిరాజుద్దీన్, ఎస్‌కే చాంద్‌పాష, బాల నాగేశ్వరరావు, దారా రంగా, బొప్పన శ్రీనాథ్, యాసా శ్రీకాంత్, నల్లగట్ల కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

కొణిజర్లలో సంబురాలు..

కొణిజర్ల: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ వైరాలో ఆ పార్టీ అభ్యర్థి రాందాస్ నాయక్ విజయం సాధించడంతో హర్షం వ్యక్తం చేస్తూ.. గొర్రెల మేకల పెంపకం దార్ల సంఘం ఆధ్వర్యంలో సోమవారం సంబరాలు జరుపుకున్నారు. సర్పంచ్ సూరంపల్లి రామారావు ముఖ్య అతిథిగా హాజరై కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వార్డు సభ్యుడు రొంటె వెంకన్న, సంఘం నాయకులు చింతల ఎల్లిబాబు, చింతల ఎల్లమ్మ, దేవర వెంకన్న, చింతల కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

రాగమయి గెలుపై..

సత్తుపల్లి: కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా డాక్టర్ మట్టా రాగమయి ఘనవిజయం సాధించడంతో జేవీఆర్ ఓసీలో ఐఎన్‌టీయూసీ సెంట్రల్ కౌన్సిల్ మెంబర్ రావి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో సోమవారం సంబురాలు నిర్వహించారు. కార్మికులకు మిఠాయిలు పంచి పెట్టారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ జనరల్ సెక్రటరీ త్యాగరాజన్, రామారావు, సమయ్య, బాలకృష్ణ, సురేష్ పాల్గొన్నారు.

కార్యకర్తల పూజలు..

ఎర్రుపాలెం: మధిర నియోజకవర్గ ఎమ్మెల్యేగా మరోసారి మల్లు భట్టి విక్రమార్క గెలుపొందడంతో సోమవారం మండలంలోని బుచ్చిరెడ్డిపాలెం, ఎర్రుపాలెం గ్రామాలకు చెందిన పలువురు నాయకులు జమలాపురం వేంకటేశ్వరస్వామి ఆలయం వరకు కాలినడకతో ర్యాలీగా చేరుకున్నారు. స్వామివారిని, శ్రీఅలివేలు మంగ, శ్రీపద్మావతి అమ్మవార్లను దర్శించుకుని పూజలు జరుపుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ శిరీష, సొసైటీ వైస్ చైర్మన్ శ్రీనివాసరావు, నాయకులు ఇస్మాయిల్, పుల్లారావు, లక్ష్మణరావు, నారాయణ, భార్గవ్, భాస్కరరావు, జానీ, మురళీ, మహబూ, శ్రీనివాసరెడ్డి, శేషురెడ్డి, రవీందర్‌రెడ్డి, రమణారెడ్డి, గోపాల్స్వామి, ప్రసాద్, సాయి, నరేంద్ర, ఓంకార్, తిరుపతమ్మ, కవిత, రాధ, పార్వతి, కీర్తి, నర్సమ్మ ఉన్నారు.